క్లుప్తంగా

కాలువల్లో పూడిక ఉండరాదు


పారిశుధ్య పనుల పరిశీలనలో కమిషనర్

చిత్తూరు అర్బన్: మురుగునీటి కాలువల్లో పూడిక ఉండరాదు.. వీధుల్లో ఎక్కడా వ్యర్థాల కుప్పలు కనిపించరాదని కమిషనర్ అరుణ నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. కమిషనర్ నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విస్తృతంగా తనిఖీ చేశారు. 35వ వార్డు పరిధిలో కయని కట్టు వీధి, ఖాదర్ మీనన్ వీధుల్లో పర్యటించి పారిశుధ్య పనులు జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. కాలువల్లో పూడిక తొలగించాలన్నారు. కాలువల్లో స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఈ వెంకట ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లోకనాథం, అమరనాథ్ రెడ్డి, ఏఈ రవీంద్ర, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

విరమణ పొందిన అధ్యాపకుడికి సత్కారం


అధ్యాపకుడిని సత్కరిస్తున్న సహచరులు

తవణంపల్లె: మండలంలోని అరగొండ బాలికల ఉన్నత పాఠశాలలోని జూనియర్ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా(లెక్చరర్) విధులు నిర్వహిస్తున్న బాలజయచంద్ర పదవీ విరమణ పొందారు. దీంతో బుధవారం డిప్యూటీ డీఈఓ చంద్రశేఖర్, హెచ్‌ఎం మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయుల బృందం కలిసి విరమణ పొందిన బాలజయచంద్రను శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. డీవైఈఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ విరమణ ప్రతి ఉద్యోగికి సహజమని, ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు: విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని అధికారులకు ఎమ్మెల్యే మురళీ మోహన్ ఆదేశించారు. మండలంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ స్థాయి అధికారులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్మశాన వాటికలు లేని గ్రామాలను గుర్తించి, వాటికి కావలసిన స్థల కేటాయింపును త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి హామీ ద్వారా లబ్ధి చేకూర్చాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల నియోజకవర్గ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

డ్రాగన్ ఫ్రూట్.. ఔషధాల గని

డ్రాగన్ ఫ్రూట్స్ బహుళ పోషకాలందించే పండుగా దీనికి పేరుంది. కరోనా వైరస్ కారణంగా ప్రజల్లో డిమాండ్ ఏర్పడింది. వీటిని సాగు చేసే రైతులకు అధిక ఆదాయాన్ని ఆర్జించి పెడుతున్నాయి. ఔషధ గుణాలు మెండుగా కలిగిన పండు కావడం, ఇంకా మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో రైతులు డ్రాగన్ ఫ్రూట్ సాగుపై దృష్టి సారిస్తున్నారు. సాగు నీటి వసతి సక్రమంగా లేని మెట్ట భూముల్లో తక్కువ నీటితో అధునాతన పద్ధతుల్లో సాగు చేస్తున్నారు.

- డ్రాగన్ సాగు.. కాసుల పంట
- ఈ పండుకు పెరిగిన డిమాండ్
- సాగుపై రైతుల ఆసక్తి
- మెండుగా పోషకాలు

ఐరాల: మండలంలోని రెడ్డివారిపల్లెకు చెందిన డీ.ఆర్.కపిల్‌కుమార్ రెండు ఎకరాల పొలంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేశారు. సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తూ నాణ్యమైన దిగుబడులు సాధిస్తూ మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. కడపలో ఒక్కో మొక్క రూ.100కు కొనుగోలు చేసి సాగుకు శ్రీకారం చుట్టారు. మూడేళ్ల క్రితం డ్రాగన్ ఫ్రూట్ రెడ్ రకం 3వేల మొక్కలను తెప్పించి నాటారు. చెట్ల మధ్య 8 అడుగులు, సాళ్ల మధ్యలో 10 అడుగుల దూరంలో సిమెంట్ స్తంభాలు నాటారు ఒక్కో స్తంభానికి నాలుగు మొక్కలు నాటారు. స్తంభం పైభాగంలో మొక్కలకు ఆలంబనగా పాత టైరును అమర్చారు. మొత్తం మీద పంటకు మొదటి ఏడాది మొక్కల ఖర్చు, సిమెంట్ స్తంభాలు, టైర్లతోపాటు ఎకరాకు రూ.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. డ్రిప్ ద్వారా పది రోజులకోసారి నీటి తడులు అందిస్తున్నారు. దీంతో పాటు మొక్కలు ఎండ తీవ్రతను తట్టుకోవడానికి మొక్కల పైభాగంలో తెల్ల సున్నం పిచికారీ చేయించారు.

దిగుబడి ఇలా...

రెండు ఎకరాలకు మొదటి ఏడాది 4 నుంచి 6 టన్నుల వరకు డ్రాగన్ పంట దిగుబడి వస్తుంది. రెండవ సంవత్సరం 6 నుంచి 10 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. మూడవ సంవత్సరం 10 నుంచి 13 టన్నుల వరకు పంట దిగుబడి వస్తుంది. తద్వారా మొదటి సంవత్సరం రూ.6.5 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు ఆదాయం వస్తుంది. అదే రెండో సంవత్సరం రూ.9 లక్షల నుంచి రూ.15.5 లక్షల వరకు ఆదాయం వస్తుంది. మూడో సంవత్సరం రూ.15.5 లక్షల నుంచి రూ. 18 లక్షల వరకు ఆదాయం వస్తుందని ఆ రైతు చెబుతున్నారు.


రెడ్డివారిపల్లెలో సాగులో ఉన్న డ్రాగన్ ఫ్రూట్


ట్రేలలో ఉన్న డ్రాగన్ ఫ్రూట్

అన్ని నేలలూ అనుకూలమే

డ్రాగన్ ఫ్రూట్ సాగుకు నీరు నిల్వ ఉండే బంక నేలలు మినహా అన్ని భూములు అనుకూలమే. మెట్ట ప్రాంత భూముల్లో డ్రాగన్ మొక్క బాగా పెరగడంతో పాటు పండ్ల సైజు, దిగుబడి కూడా ఆశించిన స్థాయిలో వస్తుంది. నీటి ఎద్దడిని సైతం సమర్థవంతంగా తట్టుకుంటూ అధిక దిగుబడులను ఇస్తుంది.

మెండుగా పోషకాలు

డ్రాగన్ ఫ్రూట్స్‌లో ఎన్నో విలువైన పోషకాలున్నాయి. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. దీర్ఘకాలిక వ్యాధులను నయం చేస్తుంది. ఈ పండ్లలో నీటి శాతం అధికంగా ఉండడంతో చర్మానికి మంచిది. మధుమేహ రోగులకు ఇది దివ్య ఔషధం. రక్తంలో హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచుతుంది. గర్భిణులకు ఈ ఫ్రూట్ ఎంతో ఉపయోగకరం. పోషకాలు మెండుగా ఉండడంతో ప్రజలు వీటి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

మార్కెట్‌లో మంచి గిరాకీ



ప్రస్తుతం డ్రాగన్ ఫ్రూట్‌కు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో ఈ పండు దివ్య ఔషధంగా ఉండడంతో ప్రజలు ఈ పండు తినేందుకు ఆసక్తి పెంచుకున్నారు. ఒకప్పుడు పెద్దపెద్ద షాపింగ్ మాల్స్‌కే పరిమితమైన ఈ పండు ఇప్పుడు మండలంలోని పండ్ల వ్యాపారస్తులు సైతం విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మా వద్దకే వచ్చి వినియోగదారులు కిలో రూ.200 వరకు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు.

–డీఆర్.కపిల్‌కుమార్, రెడ్డివారిపల్లె, ఐరాల

పాఠ్యాంశాలపై పట్టు ఉండాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ హేమలత

తవణంపల్లె: విద్యార్థులకు పాఠ్యాంశాలపై పట్టు ఉండాలని ఎంఈఓ హేమలత సూచించారు. మండలంలోని దిగువమారేడుపల్లె ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు రిజిస్టర్ పరిశీలించారు. ఐదవ తరగతి విద్యార్థులతో పాఠాలు చదివించి వారి సామర్థ్యాలను గుర్తించారు. విద్యార్థులు పాఠాలను సరళంగా చదవడం, రాయడం నేర్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న నాగపద్మిని

పూతలపట్టు (యాదమరి): ప్రకృతి వ్యవసాయంతోనే నాణ్యమైన దిగుబడి సాధించవచ్చునని జిల్లా వనరుల కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని పేర్కొన్నారు. యాదమరి మండలం పెరుమాళ్ల పెంట గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్ష తదితర అంశాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లోదుక్కులు, పచ్చిరొట్ట పంట సాగు, జీవన ఎరువులపై వివరించారు. మట్టినమూనా సేకరణ, భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం, పంట సాగు చేస్తే మేలైన దిగుబడి సాధించవచ్చన్నారు. పెట్టుబడి ఖర్చుల నుంచి బయటపడవచ్చని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధ, ఏఓ చరిత పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలని వినతి

చిత్తూరు కార్పొరేషన్: క్లాప్ ఆటో డ్రైవర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు మంజూరు చేయాలని జిల్లా కార్మికశాఖాధికారి ఓంకార్‌రావుకు నాయకులు విన్నవించారు. కార్మికశాఖ కార్యాలయంలో బుధవారం ఆయన్ను కలిసి మాట్లాడారు. చిత్తూరు నగరపాలక సంస్థలో 12 మంది క్లాప్ ఆటో డ్రైవర్లకు పలు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. డ్రైవర్ల జీవనాధారం కష్టతరంగా మారిందన్నారు. వీటిపై నగరపాలక సంస్థ కమిషనర్, హెల్త్ ఆఫీసర్‌కు తెలియజేసినప్పటికీ స్పందనలేదని చెప్పారు. నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న అధికారులు కూడా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కార్మికులకు ప్రతి నెలా జీతం చెల్లించి, పీఎఫ్, ఈఎస్‌ఐలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా కార్మికశాఖాధికారి వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజన్, మణి, డ్రైవర్లు నవీన్, సంతోష్, సుధాకర్, పవన్, రమేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోండి

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కోనగుంటలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

రోడ్డు భద్రతా నియమాలు తెలుసుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా తెలుసుకుని పాటించాలని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి అన్నారు. ఆ కళాశాలలో బుధవారం రవాణాశాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో రోడ్డు నియమాలను తప్పక పాటించాలన్నారు. ఎంవీఐ నరసింహులు మాట్లాడుతూ విద్యార్థులు ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. హెల్మెట్ వల్ల కలిగే ఉపయోగాలను చుట్టుపక్కల వారికి విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు పొందాలని తెలిపారు. ప్రతి పౌరుడు బాధ్యతగా వాహనాలు నడిపితే ప్రమాదాలు నివారించవచ్చని చెప్పారు. అనంతరం ఎంవీఐని దుశ్శాలువతో అధ్యాపక బృందం సన్మానించింది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐ శివకుమార్, వైస్ ప్రిన్సిపల్ మీరాసాహెబ్, సమన్వయకర్త సుశీల భారతి పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ర్యాలీ


ర్యాలీలో విద్యార్థులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో బుధవారం సీఎంసీ వేలూరు చిత్తూరు క్యాంపస్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని వైస్ ఎంపీపీ రంజనీ ప్రారంభించారు. 50 మంది నర్సింగ్ విద్యార్థులు ర్యాలీలో పాల్గొని బండి నడిపేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. విధిగా హెల్మెట్ ధరించాలని, వాటి ప్రాముఖ్యతను చెప్పారు.

కాణిపాకంలో ద్వారక తిరుమల ఆలయ ఈఓ


స్వామి చిత్రపటం అందుకుంటున్న త్రినాథరావు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని బుధవారం ద్వారక తిరుమల ఆలయ ఈఓ త్రినాథరావు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికి స్వామి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనాలు చేశారు. తీర్థ ప్రసాదాలతోపాటు స్వామి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది రవి విఘ్నేష్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న డీవైఈఓ చంద్రశేఖర్

బంగారుపాళెం: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని చిత్తూరు డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి(డీవైఈఓ)చంద్రశేఖర్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో వివిధ రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు బోధనా పద్ధతులు మధ్యాహ్న భోజన అమలు గురించి ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యార్థుల స్థాయిని అనుసరించి బోధనా పద్ధతులు చేపట్టాలని సూచించారు. ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించాలన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు విద్యతో పాటుగా క్రీడలను ప్రోత్సహించి రాణించేందుకు తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రమేష్‌బాబు, ఇన్‌చార్జి హెచ్‌ఎం జనార్దన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్యం అందిస్తాం

తవణంపల్లె: అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులకు మెరుగైన వైద్యం అందిస్తామని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మూర్తి అన్నారు. మండలంలోని స్వస్తిక్‌నగర్‌లో గిరిజన సంక్షేమ శాఖ, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మాట్లాడుతూ, అటవీ ప్రాంతాల్లోని గిరిజనులకు సరైన వైద్యం అందక రోగాల బారిన పడుతున్నట్లు తమ దృష్టికి రావడంతో జిల్లాలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైద్యాధికారులు ప్రియాంక, మోహన్ వేలు 96 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వర పీడితులకు రక్తనమూనాలు సేకరించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఐరాల సీడీపీఓ నిర్మల, సీహెచ్‌ఓ రాజామణి, సూపర్‌వైజర్లు రాజశేఖర్, రెడ్డెమ్మ, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యంరెడ్డి, చాముండేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ అధికారి మూర్తి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ఐరాల: ఐరాల మండలంలోని గోవిందరెడ్డిపల్లె ఎస్టీ కాలనీలో పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 52 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారి మాట్లాడారు. సర్పంచ్ గుణవతి, సీడీపీఓ నిర్మల, పీహెచ్‌ఎన్ జీవకళ, సూపర్‌వైజర్ చిన్నమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్యామల, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఏఎన్‌ఎం శాంత కుమారి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి మొక్కలు పెంచాలి


పోటీల్లో బహుమతులు పొందిన విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: ప్రతి విద్యార్థి మొక్కలు పెంచాలని ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపల్ వేదవతి అన్నారు. నగరంలోని సీబీ రోడ్డులో ఉన్న ఆ పాఠశాలలో బుధవారం పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే మొక్కలు నాటడం, సంరక్షించడం నేర్చుకోవాలన్నారు. అనంతరం మొక్కలు పెంచడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు తెలియజేశారు. ఆ పాఠశాలలో పచ్చదనం పరిశుభ్రతపై చిత్రలేఖనం, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్స్ రూప, అకడమిక్ డీన్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడే స్టాండింగ్ కమిటీ ఎన్నికలు

- అన్ని ఏర్పాట్లు పూర్తి
- 5 స్థానాలకు 8 మంది పోటీ
- 53 మంది సభ్యులకు ఓటు హక్కు
- సాయంత్రంలోపు ఫలితాల ప్రకటన



చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో స్టాండింగ్ కమిటీ ఎన్నికలు గురువారం జరగనున్నాయి. అయితే ఎపుడూలేని విధంగా కార్పొరేషన్ ఆవిర్భవించాక స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకోవడానికి పోలింగ్ జరగడం ఇదే తొలిసారి. అసలు చిత్తూరు మునిసిపాలిటీగా ఉన్నప్పుడు కూడా స్టాండింగ్ కమిటీ సభ్యులకు ఎన్నికలనేవి జరగలేదు. మేయర్ స్థానం ఏ పార్టీ అయితే గెలుచుకుంటుందో, ఆ మెజారిటీ ఆధారంగానే స్టాండింగ్ కమిటీ సభ్యులను ఏకగ్రీవం చేసుకుంటారు. ఇపుడు ఎన్నికలు జరగనుండడంతో అందరి చూపు మునిసిపల్ కార్పొరేషన్ వైపే ఉంది.

కమిటీ కీలకం

కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులకు సంబంధించి కమిషనర్‌కు రూ.10 లక్షల లోపు వరకు విలువ చేసే కేటాయింపులపై నిర్ణయం తీసుకునే అధికారం ఉంది. రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల లోపు వరకు పనులకు స్టాండింగ్ కమిటీలోని మెజారిటీ సభ్యులు ఆమోదం తెలపాలి. రూ.50 లక్షలకు పైబడిన పనులను చేయడానికి కౌన్సిల్ సమావేశంలో ఆమోదించాల్సి ఉంది. నిబంధనల మేరకు కౌన్సిల్ సమావేశం ప్రతి మూడు నెలలకోసారి తప్పనిసరిగా నిర్వహించాల్సి ఉండగా, నెలకోమారు స్టాండింగ్ కమిటీ సభ్యులు సమావేశం కావచ్చు. అత్యవసర పనులు, పరిపాలన సౌలభ్యమైన నిర్ణయాలు తీసుకోవడానికి స్టాండింగ్ కమిటీకి అధికారం ఉంటుంది. ఇక్కడ తీసుకున్న నిర్ణయాలు మళ్లీ తప్పనిసరిగా కౌన్సిల్ ముందు ఉంచి, అక్కడ కూడా ఆమోదించాల్సి ఉంటుంది. ఇటీవల చిత్తూరు కార్పొరేషన్‌లో పలువురు కార్పొరేటర్లు పార్టీ మారడంతో తాజాగా స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక కీలకంగా మారింది.

వాళ్లకు ఓటు లేదు

కార్పొరేషన్ కార్యాలయంలో జరిగే ఈ ఎన్నికల్లో ఐదుగురి కార్పొరేటర్లను స్టాండింగ్ కమిటీకి ఓటు హక్కు ద్వారా ఎన్నుకోనున్నారు. ఇప్పటికే మేయర్‌తో సహా 24 మంది వరకు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను టీడీపీలోని చేర్చుకున్న ఆ పార్టీ నాయకులు.. స్టాండింగ్ కమిటీలోనూ సంఖ్యా బలం ఉండాలని భావించి ఎన్నికను ఏకగ్రీవం చేయాలని భావించారు. ఇందుకోసం కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఓ అధికారి సర్వశక్తులు ఒడ్డినా కుదర్లేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు కార్పొరేటర్లు నామినేషన్లు వేసి, ఉపసంహరించుకోకపోవడంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఉదయం 11.30 గంటల నుంచి బ్యాలెట్ పేపర్ల ద్వారా పోలింగ్‌ను నిర్వహించనున్నారు. నగరంలోని 50 మంది కార్పొరేటర్లు, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు, చిత్తూరు ఎంపీ మొత్తం కలిపి 53 మందికి ఓటు హక్కు ఉంది. పోటీలో ఎనిమిది మంది కార్పొరేటర్లు ఉంటే.. కార్పొరేటర్లు అయిదుగురికి మాత్రమే టిక్ మార్కు ద్వారా ఓటు ఎవరికి వేస్తున్నామని సూచించాల్సి ఉంటుంది. అయిదుగురి కంటే ఎక్కువ మందికి ఓటు వేస్తే అది చెల్లదు. ఇదే సమయంలో ఒకరు, ఇద్దరికి మాత్రమే ఓటు వేసి, మిగిలిన వాళ్లకు ఓటు వేయకపోయినా అది చెల్లుబాటే అవుతుంది. అయితే కో–ఆప్షన్ సభ్యులుగా ఉన్న అయిదుగురికి ఓటు హక్కు ఉండదు. పోలింగ్ పూర్తయిన వెంటనే ఓట్లను లెక్కించి గెలిచిన సభ్యులను ప్రకటిస్తారు.

బ్యాలెట్‌లో తప్పులు

నామినేషన్ల ఉప సంహరణ పూర్తయిన వెంటనే పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రచురించాల్సిన అధికారులు ఉద్దేశపూర్వకంగా దాన్ని గోప్యంగా ఉంచారు. అసలు దీన్ని మీడియాకు సైతం ఇవ్వాలని నిబంధన ఉన్నా, అదేమీలేదని తప్పించుకుంటున్నారు. ఇక పోలింగ్ మూడు రోజుల ముందే మోడల్ బ్యాలెట్ నమూనా తయారుచేసి నోటీసు బోర్డులో ఉంచాల్సిన అధికారులు, ఆ పని కూడా చేయలేదు. గురువారం హడావుడిగా ఓ మోడల్ బ్యాలెట్‌ను రూపొందించి పలువురు కార్పొరేటర్లకు ఇచ్చారు. తెలుగు భాషలో ఉన్న అచ్చులు, హల్లుల ప్రకారం పోటీలో ఉన్నవారి పేర్లతో బ్యాలెట్ రూపొందించాల్సిన అధికారులు, ఇష్టారాజ్యంగా వ్యవహరించి వారికి నచ్చిన పేర్లతో మోడల్‌ను రూపొందించారు. దీనిపై డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ అభ్యంతరం వ్యక్తంచేసి, నిబంధనలు చెప్పడంతో మళ్లీ తుది బ్యాలెట్‌ను రూపొందించారు. మొత్తంగా ఈ వ్యవహారంలో కార్పొరేషన్ అధికారుల పనితీరుపై సర్వత్రా విమర్శలు తప్పలేదు.



రెండోమారు సిద్ధం చేసిన బ్యాలెట్ నమూనా

సర్వం సిద్ధం

నేటి పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశాం. అయితే ఓటు వేయడానికి లోపలకు వచ్చిన వాళ్లకు మాత్రమే బ్యాలెట్‌ను అందజేస్తాం. బ్యాలెట్‌లో ఉన్న ఎనిమిది మందిలో ఐదుగురికి తగ్గకుండా ఓటు హక్కు ఉపయోగించాలి. అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోలీసు బందోబస్తు కూడా ఉంచాం. గెలిచిన వాళ్లను సాయంత్రంలోపు ప్రకటిస్తాం.

–రామకృష్ణుడు, సహాయ కమిషనర్, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్

నేడు చిత్తూరులో డయల్ యువర్ ఎమ్మెల్యే

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం గురువారం డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న ఈ కార్యక్రమం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరుగుతుందన్నారు. ప్రజలు ఏవైనా సమస్యలుంటే ఫోన్ – 9849907885కు ఫోన్‌చేసి తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు కార్పొరేషన్ అధికారులు, చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. గత వారం వచ్చిన సమస్యలపై అధికారులు నివేదిక ఇవ్వాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి

తవణంపల్లె: వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు నిరంజన్‌కుమార్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కె.పట్నంలో నిరంజన్‌కుమార్ రెడ్డి బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం అందుకున్న సునీల్‌కుమార్ నిరంజన్‌కుమార్‌రెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయనతోపాటు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.